

WWW.VIJAYAKERATAM.COM

RNI: APTEL/2010/34724

విజయకెరటం

తెలుగు దినపత్రిక

నిజం మా ధ్యేయం - ప్రజలే మా లక్ష్యం

VIJAYA KERATAM TELUGU DAILY



నవంబర్ 12 గురువారం 2026 | సంపుటి : 18 | సంచిక : 276 | పేజీలు : 4 | వెల రూ. 1.00/- | ఎడిటర్ : యం.డి.మక్సూద్ అహ్మద్

THURSDAY NOVEMBER 12 2026 | VOL:18 | ISSUE: 276 | PAGES:4 | Rs. 1:00 | EDITOR:MD. MaKsood Ahmed

వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు.. బ్లూకాలర్‌కు ఢోకా లేదు: సీఎం రేవంత్

విద్య, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్న రేవంత్

ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వెల్లడి

విద్య, నీటిపారుదలకు నెహ్రూ బలమైన పునాదులు వేశారని వ్యాఖ్య

మౌలానా అబుల్ కలాం ఆజాద్ కృషి వల్లే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నారని వెల్లడి

మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో విద్య, నీటిపారుదల రంగాల అభివృద్ధికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని సీఎం (మిగతా 2వ పేజీలో..)

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క

సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన (మిగతా 2వ పేజీలో..)



ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు.. ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి: సీఎం చంద్రబాబు

రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు

ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు

జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక

36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్

సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు. (మిగతా 2వ పేజీలో..)

ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!

ఇది బలపడి వాయుగుండంగా మారే అవకాశం

నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా

దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఇది క్రమంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా వేసింది. అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లోనే తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఉత్తర తమిళనాడు తీరం వైపు కదులుతుందని వివరించారు. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే భారీ వర్షాల కంటే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలే ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత అల్పపీడనం కదలికను బట్టి వర్షాల పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

విశాఖపట్నంలో రేపు ప్రారంభం కానున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు

అనివార్య కారణాలతో అమిత్ షా పర్యటన రద్దు

ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

విశాఖపట్నం వేదికగా గురువారం ప్రారంభం కానున్న ప్రతిష్టాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కావడం లేదు. అనివార్య కారణాల వల్ల ఆయన విశాఖ పర్యటన రద్దయినట్లు కేంద్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సమాచారం అందించింది. దీంతో అమిత్ షా స్థానంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల (మిగతా 2వ పేజీలో..)



రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

రూ. 3,230 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు

2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీ ప్రారంభం

ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా



భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సజజూ) అధికారికంగా (మిగతా 2వ పేజీలో..)

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య

యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే (మిగతా 2వ పేజీలో..)

విజయకేరటం
తెలుగు దినపత్రిక

02 జనరల్ న్యూస్

సంపాదకీయం

వలసలకు అడ్డుకట్ట.. గ్రామీణ ఉపాధికి పెద్దపీట!

ఉపాధి కోసం సొంత ఊరును, కుటుంబాన్ని, ఆత్మీయులను వదిలి పట్టణాలు, నగరాలకు వలస వెళ్లడం నేడు అనేక కుటుంబాల్లో సాధారణంగా మారింది. మెరుగైన ఆదాయం, ఉద్యోగ అవకాశాలు, జీవన ప్రమాణాల కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పట్టణాల బాట పడుతున్నారు. అయితే ఈ వలసల వెనుక ప్రధాన కారణం గ్రామాల్లో తగిన ఉపాధి అవకాశాలు లేకపోవడమే. గ్రామాల్లోనే గౌరవప్రదమైన జీవనోపాధి లభిస్తే ప్రజలు తమ ప్రాంతాలను వదిలి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది.

గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలి

వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యవసాయ కూలీలు ఏడాది పొడవునా పని పొందలేకపోతున్నారు. వర్షాధార సాగు, పంటల ధరల్లో అనిశ్చితి, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటి సమస్యలు గ్రామీణ కుటుంబాల ఆదాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, ఆహార తయారీ, చిన్న పరిశ్రమలు, చేతివృత్తులకు ప్రోత్సాహం కల్పిస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.ప్రతి గ్రామానికి అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి వాటికి అనుగుణంగా పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్యక్రమాలను రూపొందించాలి. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే ప్రాసెసింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు అదనపు ఆదాయం లభించడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగాలు ఏర్పడతాయి.

యువతకు నైపుణ్య శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న యువతకు తగిన నైపుణ్యాలు, ఉద్యోగ మార్గదర్శకత్వం అందుబాటులో ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, అకౌంటింగ్, సాంకేతిక విద్య, యంత్రాల నిర్వహణ, డిజిటల్ సేవలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాల్లో శిక్షణ కల్పించాలి. కేవలం సర్టిఫికెట్లు అందించడం కాకుండా వాస్తవంగా ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అనుభవాన్ని కూడా కల్పించాలి.స్థానిక పరిశ్రమలు, విద్యాసంస్థలు, నైపుణ్య శిక్షణ కేంద్రాల మధ్య అనుసంధానం పెరగాలి. ఏ ప్రాంతంలో ఏ రంగానికి ఉద్యోగులు అవసరమో ముందుగానే గుర్తించి శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తే నిరుద్యోగ సమస్యను కొంతవరకు తగ్గించవచ్చు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు దాని అనుబంధ రంగాలను అభివృద్ధి చేయడం అవసరం. పాలు, పండ్లు, కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తులను నిల్వ చేసే గిడ్డంగులు, శీతలీకరణ కేంద్రాలు, ప్రాసెసింగ్ యూనిట్లు గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. రైతులు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి తగ్గుతుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, సహకార సంస్థలను బలోపేతం చేయాలి. చిన్న రైతులు సమష్టిగా ఉత్పత్తులను విక్రయించేందుకు, మార్కెట్లతో నేరుగా అనుసంధానం కావడానికి అవసరమైన సహకారం అందించాలి. వ్యవసాయాన్ని ఆధారంగా చేసుకుని చిన్న వ్యాపారాలు ప్రారంభించే యువతకు రుణాలు, శిక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలి.

మహిళలకు స్థానికంగానే ఉపాధి

గ్రామీణ మహిళల్లో ఎన్నో నైపుణ్యాలు ఉన్నప్పటికీ వాటిని ఆదాయ వనరులుగా మార్చుకునే అవకాశాలు పరిమితంగా ఉంటున్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు తయారు చేసే వస్తువులకు మెరుగైన మార్కెట్ కల్పించాలి. ఆహార పదార్థాల తయారీ, కుట్టుపని, చేతివృత్తులు, పశుపోషణ, చిన్న వ్యాపారాలకు ప్రోత్సాహం ఇవ్వాలి.మహిళా సంఘాలకు రుణాలు అందించడం మాత్రమే కాకుండా వ్యాపార నిర్వహణ, నాణ్యత, ప్యాకేజింగ్, అమ్మకాలు, డిజిటల్ మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వాలి. వారి ఉత్పత్తులను ప్రభుత్వ, ప్రైవేటు మార్కెట్లకు అనుసంధానిస్తే ఆదాయ అవకాశాలు విస్తరిస్తాయి. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబాల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయి.

గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడాలి

ఉపాధి అవకాశాలు ఉన్నప్పటికీ సరైన రహదారులు, విద్యుత్, నీరు, రవాణా, ఇంటర్నెట్ సదుపాయాలు లేకపోతే పరిశ్రమలు గ్రామీణ ప్రాంతాలకు రావడానికి వెనుకాడతాయి. అందువల్ల గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించేందుకు అవసరమైన అనుమతులు, సదుపాయాలు సులభంగా అందుబాటులో ఉండాలి.విద్య, వైద్యం, రవాణా వంటి సేవలు కూడా గ్రామాల్లో మెరుగుపడాలి. ఉద్యోగం దొరికినా కుటుంబంతో కలిసి సురక్షితంగా జీవించేందుకు అవసరమైన సదుపాయాలు లేకపోతే వలసలు తగ్గడం కష్టం. కాబట్టి గ్రామీణ అభివృద్ధిని కేవలం ఉపాధి కల్పనకే పరిమితం చేయకుండా సమగ్రంగా చూడాలి.

వలస కార్మికుల భద్రతకు చర్యలు

ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తగిన వేతనం లేకపోవడం, పని ప్రదేశాల్లో భద్రతా లోపాలు, నివాస సదుపాయాల కొరత, వైద్య సదుపాయాలు అందకపోవడం వంటి ఇబ్బందులు ఉంటున్నాయి. ముఖ్యంగా అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత అందించాలి.వలస కార్మికుల వివరాలు నమోదు చేయడం, వారికి అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, ఇతర రాష్ట్రాల్లోనూ అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలి. వలస వెళ్లక తప్పని పరిస్థితుల్లో ఉన్నవారికి భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత.

గ్రామీణ అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రణాళిక

ప్రభుత్వాలు గ్రామీణ ఉపాధి సమస్యను తాత్కాలిక పథకాలతోనే పరిష్కరించలేవు. ప్రతి జిల్లాలో అందుబాటులో ఉన్న వనరులు, నైపుణ్యాలు, మార్కెట్ అవసరాలను గుర్తించి దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలి. స్థానిక సంస్థలు, పరిశ్రమలు, రైతులు, మహిళా సంఘాలు, యువజన సంస్థలను ఇందులో భాగస్వాములను చేయాలి.ఏటా ఎన్ని ఉద్యోగాలు కల్పించబడ్డాయి? ఎన్ని చిన్న పరిశ్రమలు ప్రారంభమయ్యాయి? ఎంతమంది యువతకు శిక్షణ అందింది? ఎంతమంది స్వయం ఉపాధి పొందుతున్నారు? వంటి అంశాలపై సమీక్ష జరగాలి. పథకాల ప్రకటనల కంటే వాటి ఫలితాలకే ప్రాధాన్యం ఇవ్వాలి.

సొంత ఊరిలోనే ఉపాధి.. సంతోషకరమైన జీవితం

వలసలు పూర్తిగా ఆగిపోవాలని ఆశించడం వాస్తవికం కాదు. మెరుగైన విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం వలస వెళ్లడం కొన్నిసార్లు అభివృద్ధికి మార్గం కూడా కావచ్చు. కానీ ఆర్థిక ఇబ్బందుల వల్ల, ఉపాధి లేక తప్పనిసరిగా ఊరు వదిలి వెళ్లే పరిస్థితిని తగ్గించాలి. గ్రామీణ ప్రాంతాల్లోనే ఆదాయం పొందే అవకాశాలు పెరిగితే కుటుంబ సంబంధాలు, స్థానిక ఆర్థిక వ్యవస్థ, సామాజిక జీవనం బలోపేతమవుతాయి.గ్రామాలు బలపడితేనే దేశ అభివృద్ధికి పునాది పటిష్ఠమవుతుంది. రైతుకు గిట్టుబాటు ధర, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలకు స్వయం ఉపాధి, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం, మెరుగైన మౌలిక వసతులు కల్పించినప్పుడే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి వస్తుంది. ఉపాధి కోసం సొంత ఊరును వదిలి వెళ్లాల్సిన పరిస్థితి తగ్గి, సొంత ప్రాంతంలోనే గౌరవప్రదంగా జీవించే అవకాశాలు పెరగాలి. గ్రామీణ ఉపాధి బలోపేతమే సమతుల్య అభివృద్ధికి నిజమైన మార్గం!

వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు.. బ్లూకాలర్‌కు ఢోకా లేదు: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, యూనివర్సిటీలు, ఐఐటీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు.సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, బ్లూకాలర్ ఉద్యోగాలకు మాత్రం ఆ ప్రమాదం లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూసీ అభివృద్ధి పూర్తయితే పాతబస్తీకి పర్యాటకుల రాక పెరుగుతుందని, నగరంలో నైట్ ఎకానమీకి ఊతం లభిస్తుందని చెప్పారు. ఎస్ఐఆర్ పేరుతో పేదలు, మైనార్టీలు, ఎస్టీల ఓట్లు తొలగిస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఓడించడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

మొదటి పేజీ తరువాయి)

మైదానంలో నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నారు. సీఐఐ, కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేశాయి. 'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ సదస్సు జరుగుతోంది. దీనికి దాదాపు 58 దేశాల నుంచి దౌత్యవేత్తలు, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు కో-చైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 13న జరిగే ముగింపు సమావేశానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు.న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు.ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం (డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది.ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన 'అడోర్న్‌మెంట్'ను నార్త్ బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్ అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూజియానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు.ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు.. ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని తెలిపారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా 'వాటర్ రెగ్యులేటరీ కమిషన్' ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై ఈ కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దవచ్చన్నారు.

ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

మొదటి పేజీ తరువాయి)

అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక
నవంబర్ | గురువారం | 12 | 2026

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు భావితరాలకు తెలియజేయాలి





జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):

భారతరత్న, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ పోరాట స్ఫూర్తి, ఆలోచనా విధానాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతిని పురస్కరించుకుని బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, విద్యావేత్తగా పేరుపొందిన ఆజాద్.. మహాత్మా గాంధీ పిలుపు మేరకు స్వదేశీ, సత్యాగ్రహ, సహాయ నిరాకరణ ఉద్యమాల్లో పాల్గొని స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. గాంధేయ మార్గంలో నడుస్తూ జర్నలిజం ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించారని పేర్కొన్నారు.ఆయన సేవలకు గుర్తింపుగా దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారని, భారతదేశ తొలి విద్యా విధానం రూపకల్పనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. దేశానికి చేసిన విశేష సేవలకు గుర్తింపుగా 1992లో ప్రభుత్వం ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించిందని వెల్లడించారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆఫీజ్ ఖాన్ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను కొనియాడారు. నల్గొండ డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ మాట్లాడుతూ.. ఆజాద్ అసలు పేరు మోహియుద్దీన్ అహ్మద్ అని, ఆయన విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో యూజీసీ, ఐఐటీలు, వివిధ అకాడమీల ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి విజయేందర్ రెడ్డి, కార్పొరేటర్లు, మైనార్టీ పెద్దలు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

నవంబర్ 20లోగా సర్ దరఖాస్తులు చేసుకోవాలి

ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లకు ఎన్నికల సంఘం మరో అవకాశం
జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా వివిధ కారణాలతో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. గైర్హాజరు ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మారిన ఓటర్లు ఈ నెల 20లోగా నిర్దేశిత అనెక్సర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.బుధవారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని వారి వివరాలను కేటగిరీల వారీగా బీఎల్‌ఓలకు అందజేశామని తెలిపారు. ఈ జాబితాను బీఎల్‌ఏల ద్వారా గ్రామాల్లో మరోసారి చదివి వినిపించి, అర్హులైన వారికి దరఖాస్తు చేసుకునేలా చూడాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, ఫారాలు సమర్పించని వారు మాత్రమే నవంబర్ 20లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.జిల్లాలో మొత్తం 1,58,630 ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించాల్సి ఉండగా, వివిధ కారణాలతో సేకరించని ఫారాలు ఉన్నాయని కలెక్టర్ వివరించారు. వీరిలో మరణించిన వారు, శాశ్వతంగా చిరునామా మారిన వారు, ఇతర ప్రాంతాల్లో ఇప్పటికే నమోదైన వారు, గైర్హాజరైన ఓటర్లు ఉన్నారని తెలిపారు. ముఖ్యంగా శాశ్వతంగా చిరునామా మారినవారు, గైర్హాజరు ఓటర్లు ఈ నెల 20లోగా ఎన్నికల సంఘం నిర్దేశించిన ఫారంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.మరోవైపు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు నమోదు విషయంలోనూ కలెక్టర్ కీలక వివరాలు వెల్లడించారు. ఫారం-18 ద్వారా ఓటరు నమోదుకు



నవంబర్ 6 చివరి తేదీ అయినప్పటికీ, ఈ నెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు నిర్వహించే అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణ సమయంలోనూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 30 తర్వాత కూడా పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కాంగ్రెస్ నుంచి ముంతాజ్, బీజేపీ నుంచి పి. లింగస్వామి, సీపీఎం నుంచి నర్సిరెడ్డి, బీఆర్ఎస్ నుంచి బి. పిచ్చయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి డాక్టర్ ఎస్.కె. అన్సారి, టీడీపీ నుంచి తేలు అన్నా రవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, డీటీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

15న రైతు సంఘం బహిరంగ సభను జయప్రదం చేయండి

ప్రచార జీపు జాతాలను ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):

అఖిల భారత రైతు సంఘం 36వ జాతీయ మహాసభల సందర్భంగా ఈనెల 15న నల్గొండలోని ఎన్జీ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం నల్గొండ నియోజకవర్గ పరిధిలోని నల్గొండ టౌన్, తిప్పర్తి, కనగల్, మాడుగులపల్లి మండలాల్లో ప్రచార జీపు జాతాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి కేంద్రంగా నిలిచిన నల్గొండ గడ్డపై 36వ ఏఐకేఎస్ జాతీయ మహాసభలు నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈనెల 15న లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించేందుకు విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు.ఈనెల 14 నుంచి 16 వరకు పెద్ద గడియారం సెంటర్‌లో వ్యవసాయ యంత్రాల ప్రదర్శన, అగ్రి షో, ఆటపాటలు, కళాకారుల ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 16 నుంచి 18 వరకు ప్రతినిధుల సభ జరుగుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించేందుకు ఈ మహాసభల్లో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రైతుల హక్కుల పరిరక్షణకు నల్గొండ వేదిక కానున్న నేపథ్యంలో రైతులు, కార్మికులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈనెల 15న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని సుధాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హషం, ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ సలీం, జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల



పద్మ, రైతు సంఘం నాయకులు నలపరాజు సైదులు, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, సర్దార్ అలీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మన్నెం బిక్షం, కేవీపీఎస్ జిల్లా సహాయ ఉపాధ్యక్షుడు గాదె నరసింహ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా పోస్టర్ విడుదల

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):

ఈ నెల 21, 22 తేదీల్లో చర్లపల్లిలోని సెయింట్ మేరీస్ స్కూల్ (సీబీఎస్ఈ) వేదికగా నిర్వహించనున్న 13వ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్--2026 పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, బుర్రి శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడలను ప్రోత్సహిస్తూ, పోటీల విజయవంతమైన నిర్వహణకు సహకరిస్తున్న మేయర్ దంపతులకు షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్‌పర్సన్ సిస్టర్ బి. బాల, జిల్లా అధ్యక్షుడు ఎస్. రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి ఎం. సోమశేఖర్, జిల్లా కార్యదర్శి ఎండీ అక్బర్, జ్యోతి తదితరులు, అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



యువత నైపుణ్యాలతో స్వయం ఉపాధి పొందాలి

న్యాక్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):



యువత నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం నల్గొండలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (NAC) కేంద్రంలో హైదరాబాద్ న్యాక్ డీజీ ఎం. శ్రీనివాస్ రెడ్డితో కలిసి శిక్షణ ప్రయోగశాలలను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ.. నైపుణ్యాభివృద్ధితోనే యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా న్యాక్ పనిచేస్తోందన్నారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్గొండలో రూ.20 కోట్ల వ్యయంతో న్యాక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళలు, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవడంతో పాటు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. అనంతరం వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతకు మేయర్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ ఎం. రాజిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎం.ఏ. హఫీజ్ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, కార్పొరేటర్ మహమ్మద్ ఇబ్రహీం, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పురాతన కట్టడాలు, దేవాలయాల పరిరక్షణ అందరి బాధ్యత

- **ఛాయా సోమేశ్వరాలయంలో హెరిటేజ్ వాక్ ప్రారంభించిన కలెక్టర్ బి. చంద్రశేఖర్**

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):



పురాతన, చారిత్రాత్మక కట్టడాలు, దేవాలయాలను భావితరాలకు అందించేలా సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.బుధవారం ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) తెలంగాణ చాప్టర్ ఆధ్వర్యంలో నల్గొండ సమీపంలోని పానగల్ ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో నిర్మితమైన ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయం రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని, అనేక ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు సందర్శిస్తుంటారని తెలిపారు. హెరిటేజ్ వాక్ ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను మరింతగా తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి బడ్జెట్ కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు.అంతకుముందు కలెక్టర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలోని శివలింగంపై నిరంతరం కనిపించే నీడ ఏర్పడే విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించి ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఇంటాక్ న్యూఢిల్లీ చైర్మన్ అశోక్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. పురాతన కట్టడాలను పునరుద్ధరించడం, వాటి చారిత్రక ప్రాధాన్యతను కాపాడటమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. నల్గొండ ఇంటాక్ చాప్టర్ ప్రారంభం సందర్భంగా ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందని, ఆలయ పరిరక్షణకు సంస్థ కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెరిటేజ్ డైరెక్టర్ అర్జున్ రావు, వేద్ కుమార్, సజ్జాద్ సాహిది, ధనుంజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో 480 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

డిసెంబర్ 5లోగా మీ సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలి: కలెక్టర్ బి. చంద్రశేఖర్

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):



నల్గొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో మామిళ్లగూడ వద్ద తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో 480 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో జీఓఆర్టీ నెం.579 ద్వారా జి+5 అంతస్తుల బ్లాక్‌లలో ఈ ఇళ్ల నిర్మాణానికి అనుమతి లభించిందని పేర్కొన్నారు.ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం రూ.8.50 లక్షలుగా నిర్ణయించగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన రూ.3.50 లక్షలను లబ్ధిదారులు తమ వాటాగా చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నివసిస్తున్న అర్హులు డిసెంబర్ 5వ తేదీలోగా మీ సేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు కార్పొరేషన్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాట్ ఉండకూడదని, వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించరాదని స్పష్టం చేశారు. ఒక కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తుదారులు తప్పనిసరిగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నివాసులై ఉండాలని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలు చేయాలి

నవంబర్ 15న రైతు మహాసభ బహిరంగ సభను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ సలీం పిలుపు

నల్గొండ, నవంబర్ 11:



కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో పోరాటాలు నిర్వహించి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ సలీం పిలుపునిచ్చారు.నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండ పట్టణంలో నిర్వహించనున్న 36వ అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభల సందర్భంగా నవంబర్ 15న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) హమాలీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ మైసయ్య విగ్రహం, ప్రకాశం బజార్, ఎగ్బాల్ మినార్, మిర్యాలగూడ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా తిప్పికొట్టాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు, రైతులు కలిసి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నవంబర్ 15న జరిగే బహిరంగ సభలో కార్మిక వర్గం పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హషం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు భీమగాని గణేష్, సలివోజు సైదాచారి, ఎఫ్‌సీఐ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సుంకరబోయిన వెంకన్న, కోశాధికారి నకరికంటి సత్తయ్య, పట్టణ కమిటీ సభ్యులు అద్దంకి నరసింహ, రాజేష్, రాములు తదితరులు పాల్గొన్నారు.

విజయ కెరటం
తెలుగు దినపత్రిక

ఖాజీ పేట వై ఎస్ ఆర్ నగర్ గుడిసెలను కాపాడాలని ఉప ముఖ్య మంత్రి భట్టి

విక్రమార్కకి వినతి పత్రం సమర్పించిన డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్....

హన్మకొండ విజయ కెరటం ప్రతినిధి నవంబర్ 11....



ఈ రోజు పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేసి, పూల గుచ్చం అందచేసిన అనంతరం... 2005 లో వై ఎస్ రాజ శేఖర్ రెడ్డి అదే స్థలంలో బహిరంగ సభలో ప్రకటించిన 120 గుడిసెల ను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వశీ తీసివేసే ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసం అని, వై ఎస్ ఆర్ నగర్ గుడిసెలను రక్షించాలని మరియు మిగిలిన సుమారు ఆరు ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని , ఖాజీపేట రైల్వే స్టేషన్ కు కూత వేటు దూరంలో ఉన్న ఆ ప్రభుత్వ స్థలంలో ఖాజీ పేట బస్ స్టాండ్, ఖాజీపేట మండల తహసీల్దార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం తదితర ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని భట్టి గారికి విన్నవించడశీ జరిగింది. భట్టి నీ కలిసిన వారిలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మోడెమ్ రాజేందర్ గౌడ్, సామాజిక వేత్త తంపుల మొగిలి తదితరులు ఉన్నారు.

నల్లగొండకు 480 ఇందిరమ్మ టవర్స్ ఇళ్లు మంజూరు

ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ, నవంబర్ 11 (విజయ కెరటం):



నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 480 ఇందిరమ్మ టవర్స్ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 579 విడుదల చేయడంపై నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి నల్లగొండ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సొంత ఇల్లు లేని పేద, ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాలకు సొంతింటి కల నెరవేర్చడమే ఇందిరమ్మ టవర్స్ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పట్టణంలోని అర్హులైన పేద కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.8.50 లక్షలు ఖర్చు అవుతుండగా, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించేందుకు ఆమోదం తెలిపిందని వెల్లడించారు. నల్లగొండ పట్టణ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం, సొంతింటి కల సాకారం దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని మేయర్ పేర్కొన్నారు.

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం కేసు.. మీ-సేవ, ఆధార్ కేంద్రాలు శాశ్వతంగా రద్దు

నల్గొండ, నవంబర్ 11 (విజయ కెరటం):

నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీకి సహకరించి, వైద్య ఆరోగ్యశాఖలో కారుణ్య నియామకం పొందిన కేసులో సంబంధిత మీ-సేవ, ఆధార్ కేంద్రాలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. నల్గొండ జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న చందు మీ-సేవ కేంద్రంతో పాటు ఆధార్ కేంద్రాన్ని శాశ్వతంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వెల్లడించారు.ఈ రెండు కేంద్రాలను పనస చంద్రశేఖర్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నారని, నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీకి సహకరించినట్లు ఆయనపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని కలెక్టర్ తెలిపారు. ఈ వ్యవహారంలో ఆయన ప్రమేయం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం చందు మీ-సేవ కేంద్రం, ఆధార్ కేంద్రం రెండింటి అనుమతులను శాశ్వతంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

అనిరుధ్-కావ్య పెళ్లికి గ్రీస్‌నే ఎందుకు ఎంచుకున్నారు? కారణాలివే..!

సినిమా పాటలతో యువతను ఉర్రూతలూగించే సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్.. సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. ఈ వేడుకకు గ్రీస్ వేదికవుతోంది. ఇంతకీ ఈ ప్రత్యేక వేడుకకు గ్రీస్‌నే ఎందుకు ఎంచుకున్నారని చాలా మంది నెటిజన్లు ఆరా తీస్తున్నారు. దానికి గల కారణాలేంటో చూద్దాం..

శాంటోరిని సమీపంలో వేడుకలు

గ్రీస్‌లోని శాంటోరిని సమీపంలో వివాహ వేడుకలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్, సూపర్‌స్టార్ రజనీకాంత్ విమానాశ్రయంలో కనిపించిన ఫొటోలు, వీడియోలు ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. అతిథుల కోసం మారన్ కుటుంబం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. నాలుగు ప్రత్యేక విమానాలను కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

ఆరుబయట వేడుకలకు అనువైన వాతావరణం

గ్రీస్‌లో ఏడాదికి దాదాపు 300 రోజులు ఎండ ఉంటుంది. మధ్యధరా సముద్ర తీర ప్రాంత వాతావరణం ఆరుబయట వివాహ వేడుకలకు అనుకూలంగా ఉంటుంది. సముద్రాన్ని వీక్షిస్తున్నట్లుగా కొండ అంచులు, ప్రకృతి అందాల మధ్య పెళ్లి వేడుకలు నిర్వహించుకునే వెసులుబాటు ఉండడంతో చాలా మంది గ్రీస్‌ను ఎంచుకుంటుంటారు.

ఫొటోలకు అద్భుతమైన నేపథ్యం

తెల్లని భవనాలు, నీలి సముద్రం, పురాతన కట్టడాలు గ్రీస్ ప్రత్యేకతలు. వీటి మధ్య తీసుకునే వివాహ ఫొటోలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ సూర్యాస్తమయ కాంతులు ఫొటోలకు మరింత అందాన్ని ఇస్తాయి.

బీచ్‌ల నుంచి పర్వత గ్రామాల వరకు..

గ్రీస్‌లోని స్వచ్ఛమైన సముద్ర తీరాలు, నీలి రంగు జలాలు పర్యాటకులను ఆకర్షిస్తాయి. మరోవైపు సంప్రదాయ గ్రామాలతో కూడిన పర్వత ప్రాంతాలు ప్రశాంతమైన వాతావరణాన్ని అందిస్తాయి. ఇలా ఒకే దేశంలో విభిన్న ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు.

ఆతిథ్యం.. రుచికరమైన వంటకాలు

గ్రీస్ సంస్కృతిలో అతిథులకు ప్రత్యేక స్థానం ఉంది. 'ఫిలోక్సేనియా' అనే గ్రీకు పదానికి అపరిచితుడిని స్నేహితుడిగా ఆదరించడం అని అర్థం. ఇక అక్కడి వంటకాల్లో తాజా కూరగాయలు, సీ ఫుడ్, మాంసాహార వంటకాలకు ప్రాధాన్యం ఉంటుంది. శాకాహారులకు అనువైన వంటకాలు కూడా అందుబాటులో ఉంటాయి. స్థానిక ద్రాక్షతో తయారయ్యే వైన్‌లు, సంప్రదాయ డ్రింక్స్ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఈ కారణాలతో గ్రీస్ ప్రపంచవ్యాప్తంగా ప్రముఖుల డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారింది.





ప్రియుడ్ని పెళ్లాడిన 'ఇరుముడి' హీరోయిన్ ప్రియా భవానీ శంకర్



చెన్నైలో నిరాడంబరంగా జరిగిన నటి ప్రియా భవానీ శంకర్ వివాహం

పదేళ్ల పాటు ప్రేమించిన కాలేజీ మిత్రుడు రాజ్ వేల్‌ను పెళ్లాడిన నటి

హంగులు ఆర్భాటాలు లేకుండా సంప్రదాయబద్ధంగా జరిగిన పెళ్లి వేడుక

కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నూతన దంపతుల వివాహ ఫోటోలు

ప్రముఖ నటి ప్రియా భవానీ శంకర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన ప్రియుడు రాజ్ వేల్‌ను ఆమె పెళ్లాడారు. నేడు (నవంబర్ 11న) ఉదయం చెన్నైలో వీరి వివాహం అత్యంత నిరాడంబరంగా, సంప్రదాయబద్ధంగా జరిగింది. సినిమా పరిశ్రమలో సాధారణంగా కనిపించే ఆర్భాటాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వేడుకలకు దూరంగా ఉంటూ, అత్యంత సాదాసీదాగా ఈ శుభకార్యాన్ని నిర్వహించారు.ఈ పెళ్లి వేడుకలో ప్రియా భవానీ శంకర్ సాంప్రదాయ ఎరుపు రంగు చీరలో మెరిసిపోగా, వరుడు రాజ్ వేల్ తెల్లటి పంచెకట్టులో కనిపించారు. వివాహానికి ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహిత మిత్రులు మాత్రమే హాజరయ్యారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఎలాంటి హంగులు లేకుండా ఇంత సింపుల్‌గా వివాహం చేసుకోవడంపై నెటిజన్లు, అభిమానులు నూతన దంపతులను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు.ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ ఇద్దరూ కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్స్. అప్పటి నుంచే వీరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. దాదాపు 10 ఏళ్లుగా వీరి బంధం కొనసాగుతోంది. ఈ విషయాన్ని ప్రియ ఎప్పుడూ దాచలేదు. గతంలో పలు ఇంటర్వ్యూలు, సోషల్ మీడియా పోస్టుల ద్వారా తమ ప్రేమను ధ్రువీకరించారు. వీరిద్దరూ కలిసి ఇప్పటికే ఒక ఇంటిని కూడా కొనుగోలు చేశారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఇప్పుడు అధికారికంగా ఒక్కటయ్యారు.న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ప్రియా భవానీ శంకర్, ఆ తర్వాత బుల్లితెర సీరియళ్ల ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 2017లో 'మేయాద మాన్' చిత్రంతో తమిళ వెండితెరకు పరిచయమై, పలు విజయవంతమైన సినిమాల్లో నటించారు. తెలుగులో 'కల్యాణం కమనీయం', 'భీమా', 'జీబ్రా' చిత్రాల్లో నటించిన ఆమె, కమల్ హాసన్ 'భారతీయుడు 2'తో పాటు నాగచైతన్య 'దూత' వెబ్ సిరీస్‌లోనూ మెప్పించారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి' చిత్రం ఘన విజయం సాధించి, తెలుగు ప్రేక్షకుల నుంచి ఆమెకు విశేష ఆదరణ దక్కింది. ప్రస్తుతం 'డిమాంటీ కాలనీ' ప్రాజెక్టులతో పాటు పలు క్రేజీ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. వివాహ జీవితంలోకి అడుగుపెట్టిన ప్రియా భవానీ శంకర్, రాజ్ వేల్ దంపతులకు సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు వెల్లువెత్తిస్తున్నారు.

సిద్ధూ జొన్నలగడ్డ కొత్త సినిమా ప్రారంభం.. నిర్మాతగా సుకుమార్!

సిద్ధూ జొన్నలగడ్డ హీరోగా ప్రారంభమైన Siddhu10

తొలి షాట్‌కు క్లాప్ కొట్టిన అల్లు అరవింద్

మోహన్ బి దర్శకత్వం.. నయన్ సారిక హీరోయిన్

నిర్మాతలుగా సుకుమార్, బన్నీ వాసు తదితరులు

జి.వి. ప్రకాశ్ కుమార్ సంగీతం

టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. Siddhu10 అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కనున్న ఈ కొత్త సినిమా బుధవారం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి షాట్‌కు క్లాప్ కొట్టి సినిమాను లాంఛనంగా ప్రారంభించారు. ఈ నెల చివర్లో రెగ్యులర్ షూటింగ్ మొదలుకానుంది. తొలుత ఓ పాటను చిత్రీకరించనున్నారు.మోహన్ బి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్టార్ డైరెక్టర్ సుకుమార్ నిర్మిస్తున్నాడు. ఆయనతో పాటు ప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, అన్మోల్ శర్మ, అశోక్ బండిరెడ్డి సంయుక్తంగా నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ సినిమాలో సిద్ధూ జొన్నలగడ్డ సరసన నయన్ సారిక కథానాయికగా నటించనుంది. మూడు జాతీయ అవార్డులు అందుకున్న సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ బాణీలు సమకూర్చనున్నాడు.సినిమా ప్రారంభోత్సవానికి సంబంధించిన ఫొటోలను సుకుమార్ సోషల్ మీడియాలో పంచుకున్నాడు. దేవుడి ఆశీస్సులతో, ఎంతో ఉత్సాహంగా Siddhu10 ప్రయాణం మొదలైందని పేర్కొన్నాడు. త్వరలోనే ఓ అందమైన ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని తెలిపాడు.మరోవైపు దర్శకుడు మోహన్ కూడా సినిమా ప్రారంభానికి ముందు భావోద్వేగభరితమైన పోస్టు పెట్టాడు. ఓ కథకుడి కల వెండితెరపై సాకారమయ్యే దిశగా తొలి అడుగు పడిందని, ప్రేమలోని మాధుర్యాన్ని ఆవిష్కరించే అందమైన కలయికగా ఈ సినిమా నిలుస్తుందని పేర్కొన్నాడు. చిత్రంలోని మిగతా నటీనటులు, సాంకేతిక బృందం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు.



Printed, Published Edited and Owned by MAKSOOD AHAMED MOHAMED,H.No. 5-8-222/1, Shams Nagar, BTS Nalgonda - 508 001 (Telangana State) Printed at Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA 508 001, (Telangana State), Published From: Shekhar Graphics & Printers H.No. 5-12-719, BTS, NALGONDA - 508 001 (A.P.), Editor: MAKSOOD AHAMED MOHAMED Cell: 9908408528